ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి జిల్లా వార్తలు
శుక్రవారం 8 మార్చి 2024 | 5





ఉయకొరుడి చేతికి సూరీడు..

మహాశివరాత్రి వేళ ఉదయిస్తున్న సూరీడు శివుడి చేతికి చిక్కాడు.. కావాలంటే ఈ చిత్రం చూడండి.. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు పుష్కరాల రేవు వద్ద ఉన్న శివుడి భారీ విగ్రహం చేతిలో సూరీడు ఇలా ఒదిగాడు.భానుడు ఉదయిస్తుండగా ఆ దృశ్యం శివుడి ఢమరుకం ఉన్న చేతిపై నుంచి చూస్తే అదే చేతితో సూర్య భగవానుడిని పట్టుకున్నట్టు కనిపించిన దృశ్యం గురువారం కెమెరాకు చిక్కింది.శివరాత్రి వేళ ఈ చిత్రం ఆకట్టుకుంది. - **పెరవలి**

శివయ్య రథానికి వందేళ్లు



పెరవలి, మార్చి 7 : ఏదైనా వస్తువుకి వందేళ్లు పూర్తయ్యాయంటే అది మామూలు విషయం కాదు.. దీనికి వందేళ్లు అని చాలా గొప్పగా చెప్పుకుంటారు. తీపర్రు శ్రీ రాజ రాజ నరేంద్ర స్వామి ఉత్సవ రథా నికి ఈ ఏడాది వందేళ్లు పూర్తయ్యాయి. వందేళ్ల కిందట తీపర్రుకు చెందిన భోగవల్లి వెంకన్న పూర్తిగా టేకుతో ఈ రథాన్ని తయారు చేయించి స్వామికి అం దజేశాడు. అప్పటి నుంచి ప్రతి ఏటా శివరాత్రికి ఈ రథంలోనే స్వామిని ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది.దాత వచ్చి రథంపై చేయి వేసే వరకు లాగుతారు. 35 ఏళ్లు దాత వెంకన్న ఆధ్వర్యంలో ఈ విధంగా నిర్వహించారు.అనంతరం ఆయన కుమా రుడు భోగవల్లి నరసింహమూర్తి 35 ఏళ్లు నిర్వహించారు.దాత మనవడు చంటిబాబు గత 30 ఏళ్లగా రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు..సుమారు పదేళ్ల కిం దట ఈ రథానికి రూ.8 లక్షలతో మరమ్మతులు చేయించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రథం టేకుతో నూతనంగా తయారు చేయాలంటే రూ.40 లక్షల పైనే ఖర్చవుతుందని సమాచారం. శుక్రవారం శివరాత్రి సందర్భంగా రాజ రాజ నరేంద్ర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రం గోదావరి ఘాట్

శివరాత్రికి ముస్తాబు



కడియపులంకలో ముస్తాబైన ఆలయం

శివరాత్రి సందర్భంగా గురువారమే శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి.. శుక్రవారం తెల్లవారుజామునే గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివయ్యను దర్శించుకుంటారు. రాత్రి 6 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు శివ జాగరణ చేస్తారు. అనంతరం జాగరణ విరమించి గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తారు. ఈ మేరకు రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి ఘాట్లను సిద్ధం చేశారు.



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

మహిళలు లక్ష్యం వైపు అడుగేయాలి : పీడీజే

రాజమహేంద్రవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల పురోగతితోనే సమాజం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన వేడుకలకు హాజరై మాట్లాడారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మహిళలు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా లక్ష్యంవైపు అడుగులు వేయాలన్నారు. మహిళలకు విద్యతో పాటు న్యాయ విజ్ఞానం అవసరమన్నారు. వారి సంక్షేమం, రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్‌ఏ) కృషి చేస్తోందని పీడీజే చెప్పారు. కార్యక్రమంలో డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

మహిళలకు టీడీపీ-జనసేన మేనిఫెస్టో
రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 7 : ప్రస్తుత దోపిడీ ప్రభుత్వంలో మహిళాభ్యుదయం కుంటిపడిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మోరంపూడిలోని గన్నిన్ శుభమస్తు కల్యాణ మండపంలో గురువారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆస్తిలో హక్కులు కల్పించి అన్న ఎన్టీఆర్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. చంద్రబాబు మహిళా సాధికారతకు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. చంద్రబాబు పవన్ మహిళాభివృద్ధికి ఒక మేనిఫెస్టోను రూపొందించారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మాట్లాడుతూ టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం పారిశుధ్య మహిళా కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, మచ్చేటి ప్రసాద్, కూరుకూరి కిషోర్, పిల్లా తనూజ, ముత్తాబత్తుల విజయ్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజి పద్మ, మహిళా అధ్యక్షురాలు దండమూడి ప్రమీల, బొండాడ హేమలత, గొందేసి మాధవీలత, పసుమర్తి నాగవర్ధిని, నల్లబోతుల భవాని, బైరెడ్డి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో.. ఎదురుగాలి



ఐప్యాక్ అతి జోక్యంతో మునుగుతున్న వైసీపీ పడవ

- తలారికి కానరాని దారి?
- సలహాదారు రాజీవ్‌కృష్ణ మౌనం
- దూరంగా పలువురు నేతలు
- టీవీఆర్‌తో మరో వైసీపీ నేత భేటీ
- ఇన్‌చార్జికి తప్పని తలనొప్పులు
- త్వరలో టీడీపీలోకి వలసలు?
- ముంచుతున్న అతి జాగ్రత్త

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొవ్వూరు వైసీపీలో గందరగోళం మరింత పెరిగింది. హోంమంత్రి తానేటి వనిత ఉన్నప్పుడు ఓ వర్గాన్ని దూరం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో వనితను గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి.. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.ఆరంభంలో వనితకు దూరంగా ఉన్న వర్గం తలారికి దగ్గరైంది. కానీ ఐ ప్యాక్ తరపున ఇక్కడ ఒక వ్యక్తి అతిజోక్యం వల్ల మొత్తం కొవ్వూరులో ఇప్పటికే అటూ ఇటూ ఊగుతున్న వైసీపీ పడవ మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా కొవ్వూరు నియోజకవర్గంలో కీలకంగా, కింగ్‌మేకర్లుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు వర్గం ఇంచుమించు పార్టీకి దూరమైపోయింది. ఈ వర్గం తలారి వెంట కూడా పయనించడంలేదు. దీనికి ఐ ప్యాక్ సలహాతో వైసీపీ తీసుకున్న నిర్ణయమే కారణంగా చెబుతున్నారు. పెండ్యాల కృష్ణబాబు కుటుంబానికి చెందిన నేత, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణను ఇక్కడ నుంచి తప్పించి నరసాపురం వెళ్లమని చెప్పడంతో ఆయన ఆగ్రహించినట్టు తెలిసింది.అక్కడకు వెళ్లి తానేం చేస్తాను.. నా సొంత నియోజకవర్గాన్ని వదిలి అక్కడకు ఎందుకు వెళతానని ప్రశ్నించి పార్టీకి దూరంగా ఉంటున్నట్టు సమాచారం. తర్వాత రాజమహేంద్రవరం లోక్‌సభ పరిశీలకుడు, సహాయకుడిగా ఉండమని నచ్చచెప్పే ప్రయత్నం చేయడంతో ఆయన డోంట్‌కేర్ అని చెప్పి హైదరాబాద్ వెళ్లిపోయినట్టు తెలిసింది. దీంతో గతం నుంచి ఆయన వెంట ఉన్న నేతలు వైసీపీ సమన్వయకర్త తలారి వెంకట్రావు వెంట కూడా వెళ్లడం లేదు. వేలాది మంది ప్రజలు వైసీపీ వైఖరిపై మండిపడుతున్నారు. చాగల్లు జడ్పీటీసీ, కొవ్వూరు ఎంపీపీ వంటి వారు దూరమవుతుండడం గమనార్హం. ఈ వర్గంలోని కొందరు నేతలు వైసీపీని వదిలేసి టీడీపీలోకి వెళ్లిపోదామని అడుగుతున్నట్టు తెలిసింది. త్వరలో ఇక్కడ వైసీపీకి పెద్ద షాక్ తగలనుంది. ఇక్కడ సర్వేలు, పరిస్థితులు చూడడానికి బాధ్యత తీసుకున్న ఐప్యాక్‌కు చెందిన వ్యక్తి మితిమీరిన జోక్యంతో కనీసం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లకే కాదు, నియోజకవర్గ ఇన్‌చార్జికి కూడా విలువ లేని పరిస్థితి ఏర్పడినట్టు సమాచారం. తమ ప్రాంతాల్లో సమస్యల గురించి చెప్పి, రోడ్లు, డ్రెయిన్లు వేయాలంటే ఐప్యాక్ వ్యక్తికి చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. వాళ్ల సలహామీదే అందరూ నడచుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఏ ప్రజాప్రతినిధికి ఇక్కడ గౌరవం లేదు. ఐప్యాక్ వ్యక్తి వచ్చి ఫలానా రోడ్డు వేస్తే, ఇక్కడ ఓట్ల ప్రభావం ఉంటుందని చెప్పి, గ్రీన్ సిగ్నల్ ఇస్తే తక్షణం వేసే అవకాశం ఉందని,కానీ నాయకులకు మాత్రం విలువ లేదని వాపోతున్నారు. ఇక్కడ నేతల పరిస్థితి ఇలా ఉంటే.. కొందరు జనసేనకు టికెట్ ఇస్తే తాము వైసీపీని వదిలేస్తామని చెప్పడం గమనార్హం

జనసేన సీటు తెచ్చుకోండి.. వైసీపీని వదిలేస్తాం..?


ఇటీవల మరో పరిణామం సంభవించింది. కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామారావుతో ఫిబ్రవరి 4వ తేదీన హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో కొవ్వూరుకు చెందిన ఓ వైసీపీ నేత భేటీ కావడం గమనార్హం. మీరు జనసేన తరపున సీటు తెచ్చుకోగలిగితే తామంతా మిమ్మల్ని నెగ్గించుకుంటామని చెప్పడం విశేషం. సదరు వ్యక్తి హోంమంత్రి వనితకు సన్నిహితంగా ఉంటూ 'రాజ'కీయంచేసేవారు. తన ఊరిలోని ముఖ్య వర్గాన్ని కాదని పెత్తనం చేసేవారు. అటువంటి వ్యక్తి ఇవాళ వైసీపీకి వ్యతిరేకంగా జనసేన నేతతో మంతనాలు చేయడం ఇటీవల పరిణామం. ఈ ఇద్దరి బేటీ కోసం ఆధారాలు సంపాదించడానికి హోటల్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించడంతో పాటు, ఇంటిలిజెన్స్ అధికారులు తంటాలు పడుతున్నట్టు సోషల్‌మీడియా తెగ ప్రచారం జరుగుతోంది.

మీడియాకు వైసీపీ తాయిలం



కొవ్వూరు, మార్చి 7 : వైసీపీ నాయకుల తీరు మారడం లేదు.. గతంలో ఎన్నడూలేని విధంగా మీడియాను తమ నియంత్రణలో పెట్టుకోవాలని ప్రయత్నాలు చేపట్టారు. మొన్న మంత్రి వేణు, నిన్న ఎంపీ మార్గాని భరత్ రామ్.. నేడు గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు మీడియా ప్రతినిధులకు తాయిలాలు అందజేశారు. కొవ్వూరు వైసీపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌కు పిలిచి గురువారం చీర, జత దుస్తులను అందజేశారు. వైసీపీ సెంట్రల్ కమిటీ నుంచి వచ్చినట్టు వైసీపీ నాయకులు చెబుతున్నారు.

20న అనపర్తికి చంద్రబాబు



అనపర్తి, మార్చి 7 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 20వ తేదీన అనపర్తిలో పర్యటించనున్నారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం వివరాలను వెల్లడించారు. 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనపర్తిలో ప్రజాగళం పేరుతో నిర్వహించే బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. బహిరంగ సభకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని ..వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

గోపాలపురంలో మద్దిపాటికి గ్రీన్‌సిగ్నల్
ఇక అధికార ప్రకటనే తరువాయి



రాజమహేంద్రవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితా కోసం కసరత్తు జరుగుతోంది. బీజేపీతో పొత్తు ఖరారవుతున్నట్టు చెబుతున్నారు.జిల్లాలో అభ్యర్థులను త్వరలోనే ప్రకటించనున్నారు. గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు పేరు మొదట నుంచి నలుగుతున్న సంగతి తెలిసిందే. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా గోపాలపురం ప్రాంతంలో పర్యటించినపుడు వెంకట్రాజు పేరు ప్రస్తావించారు. దేవరపల్లిలో సభలో పార్టీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడుతో పాటు పలువురు పార్టీ నేతలు వెంకట్రాజును మంచి మెజార్టీతో గెలిపించాలని అప్పట్లో పిలుపునిచ్చారు. అప్పటి నుంచి ఆయన పనిచేసుకుంటున్నా కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. ఆయనను మార్చాలని కొందరు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.దీంతో ప్రజలు కొంత అయోమయానికి గురయ్యారు. చివరకు గురువారం అధిష్ఠానం వెంకట్రాజుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక కొవ్వూరు ఒకటే పెండింగ్‌లో ఉంది. రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలుకు జనసేన నేత కందుల దుర్గేష్ అభ్యర్థిత్వాలను ఖరారు చేశారు.ఇవి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. రెండో జాబితాలో వీరి పేర్లు ప్రకటించనున్నారు.

వైసీపీలోకి ముద్రగడ 7
ఉత్తరకంచిలో బ్యాంక్ దోపిడీ

బస్ రాదు.. రైలు ఆగదు!

- కొవిడ్‌తో రైళ్ల హాల్ట్ కట్
- రోడ్ కం రైలు బ్రిడ్జితో బస్‌లకు బ్రేక్
- గామన్ బ్రిడ్జి వరకే ఎక్స్‌ప్రెస్‌లు
- 100 గ్రామాల ప్రజల ఇక్కట్లు
- యథేచ్ఛగా తిరుగుతున్న భారీ లారీలు
- అయినా పట్టని అధికారులు



కలెక్టరమ్మా.. చూడమ్మా..

రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద రాజమహేంద్రవరం వైపు తీసేసిన గడ్డర్.. బ్రిడ్జిపై రాత్రి సమయంలో వెళుతున్న లారీ



కొవ్వూరు, మార్చి 7 : బస్ రాదు.. రైలు ఆగదు.. ఇదీ కొవ్వూరు దుస్థితి..డివిజన్ కేంద్రమైనా కనీసం పాలకులు పట్టించుకోవడంలేదు.రాకపోకల దృష్ట్యా ఈ డివిజన్‌పై సుమారు 100 గ్రామాల ప్రజలు ఆధారపడి ఉంటారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ వెళ్లిన ప్రయాణికులు రైలెక్కితే రాజమహేంద్రవరంలో దిగాల్సిందే.. ఎందుకంటే కరోనా నుంచి కొవ్వూరులో రైళ్ల హాల్ట్ నిలుపుదల చేశారు.పోనీలే బస్ సౌకర్యం ఉంది కదా అనుకుంటే ఇటీవల రోడ్ కం రైలు బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ బస్‌ల రాకపోకలను నిలుపుదల చేసేశారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లిన ప్రజలు తిరిగి డివిజన్ కేంద్రం కొవ్వూరు చేరుకునేందుకు నరకం చూస్తున్నారు.

బస్‌లకు దారి లేదు...

రోడ్డు కం రైలు బ్రిడ్జి మరమ్మతులకు గురైందని భారీ వాహన రాకపోకలను నిషేధిస్తూ కొవ్వూరు, రాజమహేంద్రవరం వైపు ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. దీంతో కొవ్వూరు పరిసర ప్రాంతవాసుల దూర ప్రయాణాలు ప్రయాసగా మారింది. తన పరిపాలన మెచ్చి రెండోసారి హోం మంత్రి పదవి కట్టబెట్టారని గొప్పలు చెప్పుకున్న తానేటి వనిత సైతం సమస్యను పరిష్కరించలేకపోయారు. కొవ్వూరులో కనీసం రైళ్లకు హాల్ట్ ఇప్పించలేకపోయారు. ఎక్స్‌ప్రెస్‌లకు దారి చూపలేకపోయారు. ప్రజల తంటారు ప్రజలు పడతారులే అని వదిలేశారు.దీంతో కొవ్వూరు డివిజన్‌పై ఆధాపడి ప్రయాణించే సుమారు 100 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భారీ లారీలకు దారిచ్చారు..?

కలెక్టర్ ఆదేశాలతో రోడ్ కం రైలు బ్రిడ్జిపై ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేసి భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేయించారు. అయితే ఆ గడ్డర్లు పట్టుమని పదిరోజులు కూడా నిలువలేదు. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను మాత్రమే పూర్తిగా నిలుపుదల చేయగలిగారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో ఇసుక, గ్రావెల్ తరలించే భారీ లారీలు యథేచ్ఛగా వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజా రవాణాకు అంతరాయం కలిగించి, నిబంధనలను అతిక్రమించి అక్రమ రవాణాకు అనుమతిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రజా రవాణా నిలుపుదల చేసి..రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా చేసే లారీలు యథేచ్ఛగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.ఇంత జరుగుతున్నప్పటికి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదు.

ప్రజలకు ప్రయాణ ప్రయాసే..

పల్లె వెలుగు బస్సులకు అనుమతిచ్చిన అధికారులు, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ఆంక్షలు విధించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాదు వంటి మహా నగరాల నుంచి రాత్రిపూట ఇంటికి వచ్చేవారు కాని, రాత్రి సమయంలో దూర ప్రాంతాలకు వెళ్లవలసినవారు గామన్ వంతెన వద్దకు వెళ్లి బస్సు ఎక్కవలసి వస్తుంది. కొన్ని బస్సులు హైవే పైనుంచి వెళ్లిపోతుండ డంతో అక్కడే దిగి వేచి చూడాల్సిన పరిస్థితి. గామన్ బ్రిడ్జి సెంటర్‌లో ప్రయాణికులు వేచి ఉండడానికి గాని, నిలబడడానికి సరైన వసతులు లేకపోవడం, బ్లేడ్ బ్యాచ్ వంటి అల్లరిమూకలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్ట్ రద్దు చేశారు. కొవిడ్ అనంతరం దేశ వ్యాప్తంగా రైళ్ళ హాల్ట్‌ను పునరుద్ధరించారు. అయితే కొవ్వూరులో ఈనాటికి రైళ్లు ఆగడం లేదు. 10 కి.మీ దూరంలో మూడు హాల్ట్‌లు ఉన్నాయని సాకుగా చూపిస్తున్నారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, మండలాల్లో సుమారు 100 గ్రామాలతో పాటు పోలవరం ఏజెన్సీ ప్రాంతవాసులకు అనువుగా ఉంటుంది. రాజమహేంద్రవరం మెయిన్ స్టేషన్ తరువాత గోదావరి స్టేషన్ కంటే కొవ్వూరులోనే రైళ్లు నిలుపుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఇప్పటికి నాలుగుసార్లు పలువురు వినతి పత్రం అందించారు. అయినా ఎటువంటి స్పందన లేదు.

కలెక్టరమ్మా.. ఆలోచించమ్మా..

గామన్ బ్రిడ్జి వద్ద బస్ దిగి ప్రయాణికులు కొవ్వూరు చేరుకోవాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. ఎందుకంటే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు బస్టాండ్‌లోకి రావడంలేదు. దీంతో గామన్ బ్రిడ్జి వద్ద దిగి ఆటో రూ.200 నుంచి రూ.300 లకు మాట్లాడుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇక రైలు ప్రయాణికులదీ మరో ప్రయాస.. విజయవాడలో రైలె క్కితే రాజమహేంద్రవరంలో దిగి మళ్లీ కొవ్వూరు చేరు కోవాల్సిన అగత్యం ఏర్పడింది. దీంతో కొవ్వూరు నుంచి రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎన్నికల సమయం కావడంతో కాస్త ఆలోచించి కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం : కలెక్టర్



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బాధ్యత ఎన్నికల సిబ్బంది, అధికారులతో సమానంగా మీడియాపై ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ కలిసి ఎన్నికల్లో మీడియా పాత్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పాత్రికేయులు వాస్తవమైన సమాచారంతో కూడిన రిపోర్టింగ్ చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు మాత్రమే ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను సర్వీస్ ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ,అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారికి ,హోం ఓటింగ్‌ను 85 ఏళ్ళు దాటిన, 40 శాతం పైబడిన దివ్యాంగులు, కొవిడ్ బారిన పడిన వారికి ఇస్తామని తెలిపారు. ఎన్నికల సమాచారం కోసం ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ రూపొందించినట్టు తెలిపారు.ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి సిటిజన్ విజల్ యాప్ పని చేస్తుందని చెప్పారు. దీని ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.ఎన్నికల ఫిర్యాదులకు 1950 కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ఎన్నికల్లో నోటిఫికేషన్ ప్రారంభం నుంచి ఎన్నిక ప్రక్రియలో కౌంటింగ్ పూర్తయ్యేవరకు మీడియా అనుసరించాల్సిన అంశాలను పవర్ పాయిట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలోడీపీఆర్‌వో శ్రీనివాస్,మీడియాప్రతినిధులు పాల్గొన్నారు.

85,311 మందికి వైఎస్ఆర్ చేయూత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 7: జిల్లాలో 85,311 మంది మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా రూ 159కోట్ల96 లక్షలు ఆర్థిక ప్రయోజనాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేయడం జరిగిందని కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు.అనకాపల్లిలో గురువారం సీఎం జగన్ వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో భాగంగా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమచేశారని చెప్పారు. మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యిందన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కలెక్టర్ మహిళా లబ్ధిదారులకు చెక్ అందించారు.

రెక్కీ నిర్వహించి..పక్కా ప్లాన్ వేసి..

ఉత్తరకంచిలో బ్యాంకు దోపిడీ నిందితుల అరెస్టు

కిలో బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


స్వాధీనం చేసుకున్న సొత్తు

కాకినాడ క్రైం, మార్చి 7: వేర్వేరు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు సభ్యులు ఒక ముఠాగా ఏర్పడి గత నెల 7వ తేదీన ప్రత్తిపాడు మండలం, ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్‌లో దోపిడీకి పాల్పడ్డారని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి దుప్పట్లు విక్రయించే వ్యాపారస్తుల మాదిరిగా లాడ్జి లో బస చేసి అక్కడ నుంచి ఫోన్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని బ్యాంకులను గుర్తించి వాటి దోపిడీయే లక్ష్యంగా పక్కా పథకం అమలు చేస్తారని ఎస్పీ చెప్పారు. నెలరోజుల వ్యవధిలోనే చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి కిలో బంగారు ఆభరణాలు, రూ.1,19,700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన మరో ముగ్గురి నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయ, సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ వివరాలు అందించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ప్రత్యేక పర్యవేక్షణలో ట్రైనీ ఐపీఎస్ నవజ్యోతి మిశ్రా, ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్ సారథ్యంలో బృందాలుగా విడిపోయి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నిఘాను పటిష్టం చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పోలీస్ బృందాలు పెట్రోలింగ్ చేస్తుండగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు వ్యక్తులు తారాసపడ్డారు. వారిని అదుపులోకి తీసుకునే క్రమంలో ముగ్గురు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు. మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. ఉత్తరప్రదేశ్‌లోని బదానీ జిల్లా, బరాలీ మండలం, హస్పూర్ హరియా గ్రామానికి చెందిన 25 ఏళ్ల ధన్విర్ అలియాస్ గ్యాస్‌స్టౌవ్, అలియాస్ మేస్త్రీ, మహారాష్ట్ర, బుల్దాన్ జిల్లా, చిక్కిలి తాలుకా పింపుల్ గావ్ వుండా పోస్ట్, నైగావ్ గ్రామానికి చెందిన 25 ఏళ్ల అక్షయ్ గజానన్ అంబోర్, అదే ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల హరీష్ మిలింద్ గైక్వాడ్, మహారాష్ట్ర అమరావతి జిల్లా, ఎర్ల గ్రామానికి చెందిన 23 ఏళ్ల వైభవ్ నారాయణరావ్ అడోల్ తదితరులు మరో ముగ్గురితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి బ్యాంక్ చోరీకి పాల్పడ్డారన్నారు. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కొన్ని రోజుల ముందే రాష్ట్రానికి వచ్చి ఇక్కడ కొన్ని బ్యాంకుల వద్ద రెక్కీ చేసుకుని తిరిగి మహారాష్ట్రకు వెళ్లి అక్కడ నుంచి ధన్విర్‌ను, అలాగే ప్రస్తుతం పరారీలో ఉన్న మరో నిందితుడిని తీసుకుని మండపేట చేరుకుని దుప్పట్ల వ్యాపారం నిమిత్తం వచ్చామని లాడ్జిలో రూం తీసుకున్నారు. అక్షయ్, వైభవ్, హరీష్, పరారీలో ఉన్న నిందితుడు కలిసి మండపేటలో ఓ బ్యాంకు దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించి అనువుగా లేకపోవడంతో మండపేటలో లాడ్జి ఖాళీ చేసి సామర్లకోటలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. గూగుల్ ద్వారా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి, ఎస్‌బీఐ బ్యాంక్ శాఖను దోపిడీ చేసేందుకు అనువైనదిగా గుర్తించారు. గత నెల 7న రాత్రి మొత్తం ఏడుగురు కలిసి ఉత్తరకంచి వచ్చి బ్యాంక్ చుట్టుపక్కల రెక్కీ చేసి నేరం చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉత్తరకంచి గ్రామ శివారుకు చేరుకుని హరీష్ అనే వ్యక్తిని కారు తీసుకుని వెళ్లిపోయి తిరిగి తెల్లవారు జామున నాలుగు గంటలకు రమ్మని చెప్పి మిగిలిన ఆరుగురు కారు దిగి పొలాల్లో నుంచి శ్మశానం మీదుగా రాత్రి ఒంటిగంట సమయంలో బ్యాంక్ వద్దకు చేరుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం బ్యాంక్ వెనుక కిటికీని కట్ చేసి బ్యాంక్ లోపలకి వెళ్లి గుమ్మం వద్ద ఉన్న అలారం వైర్‌లను అలాగే బ్యాంక్ సీసీ టీవీ వైర్లను కట్ చేసి బయట కిటికీల వద్ద వైభవ్ మరో నిందితుడిని కాపలాగా పెట్టి ధన్విర్, అక్షయ్, మరో నిందితుడు కలిసి బ్యాంక్‌లోకి వెళ్లగా ధన్విర్ మరో ఇద్దరు బ్యాంక్ స్ట్రాంగ్ రూం తాళాలు పగలగొట్టి అక్కడ ఉన్న నాలుగు లాకర్లలో రెండు లాకర్లను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ. 27,34,320 నగదును అలాగే సుమారు రూ.1,18,84,296 విలువైన మూడు కిలోల 280 గ్రాముల బంగారు ఆభరణాలను సంచులలో వేసుకుని బ్యాంక్‌లో బంగారు తూకం వేసే ఎలక్ట్రానిక్ త్రాసును, క్యాష్ కౌంటింగ్ మిషన్‌ను తీసుకుని గ్యాస్ సిలిండర్‌ను ఇతర సామగ్రిని బ్యాంక్‌లోనే వదిలివేసి బ్యాంక్ వెనుక నుంచి మెయిన్ రోడ్డు మీదకు వచ్చి తెల్లవారు జామున 4 గంటల సమయంలో కారు ఎక్కి సామర్లకోట వెళ్లిపోయినట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. అక్కడ బ్యాంక్ నుంచి తెచ్చిన ఎలక్ట్రానిక్ కాటాతో బంగారాన్ని తూచి, క్యాష్ కౌంటింగ్ మిషన్‌తో క్యాష్ లెక్కించి ఏడుగురు వాటాలు పంచుకుని 8 తేదీన రెండు బృందాలుగా విడిపోయి కారులో నలుగురు మహారాష్ట్రకు, ముగ్గురు రైలులో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అయితే పట్టుబడిన నలుగురు నిందితుల నుంచి రూ. 30,69,700 విలువైన కేజీ బంగారం, రూ.1,19,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితుల కోసం అలాగే మిగిలిన చోరీ సొత్తు రికవరీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారిని, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, పెద్దాపురం సీసీఎస్ సీఐ అంకబాబు, కాకినాడ సీసీఎస్ సీఐ చిట్టిబాబు, కాకినాడ ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, సామర్లకోట సీఐ డి.సురేష్, టూటౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్, ఐటీ కోర్ సీఐ పి.శ్రీనివాస్, రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ, ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీం పనులకు మోదీ శంకుస్థాపన

వర్చువల్ విధానంలో కార్యక్రమాన్ని వీక్షించిన నేతలు, అధికారులు


వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అన్నవరం, మార్చి7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ 20.06 కోట్లకు సంబంధించిన పనులకు గురువారం ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఉదయం 11 గంటలకు రత్నగిరిపై రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అధికారులు, సిబ్బంది, భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఈఈ మూర్తి మాట్లాడుతూ రూ.11.50 కోట్లతో 50 వేల చదరపు అడుగులలో 1600 మంది ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించే విధంగా నూతన అన్నదాన భవనం ప్రస్తుత టీటీడీ సత్రం ప్రదేశంలో నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే అక్కడే భక్తులు వేచి ఉండేందుకు రూ.5.94 కోట్లతో క్యూకాంప్లెక్స్, రూ.61.85 లక్షలతో మరుగుదొడ్లు, స్నానపు గదులు, రూ.1.02 కోట్లతో 4 ఎలక్ట్రికల్ బస్సులు, రెండు చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీ గీత మాట్లాడుతూ ప్రసాద్ పథకం పనులకు మోదీ శంకుస్థాపన చేయడం ద్వారా జాతీయస్థాయిలో అన్నవరం ఆలయానికి మరింత గుర్తింపు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్, రాష్ట్ర టూరిజం అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా ముగిసిన మహారుద్రాభిషేకం

ఏలేరు నదిలో పార్థివ లింగాల నిమజ్జనం


ఏలేరు నదిలో లింగాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి7: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి పార్థివ లింగ మహారుద్రాభిషేకం ఘనంగా ముగిసింది. గురువారం ఉదయం 8.30 గంటలకు పూర్ణాహుతి గావించారు. శ్రీ శృంగేరి జగద్గురు కృప పోషిత మఠాధిపతి జగద్గురు పరమహంస, తుని తపోవన మఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి హాజరై పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని కోటి లింగాలను దర్శించుకున్నారు. అనంతరం లింగాలను భక్తులు ఏలేరు నదిలో నిమజ్జనం


శివలింగానికి అభిషేకం చేస్తున్న సచ్చిదానంద సరస్వతి

చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని కోటి లింగాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీలు మాట్లాడుతూ ఆ శివుడి సంకల్పంతో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. అనంతరం వేలాదిగా వచ్చిన భక్తులందరికీ మహా అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, తుమ్మల బాబు, ఆకుల రామకృష్ణ, కోర్పు సాయితేజ, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, అడబాల రామాంజనేయులు, జీను మణిబాబు, మునిరెడ్డి నాగేశ్వరరావు, సుంకవిల్లి రాజు, దాపర్తి సీతారామయ్య పైడిపాల సూరిబాబు, జంపన రవివర్మ తరలివచ్చారు.

స్వీట్ల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కడియం, మార్చి 7: కడియం మండలం దుళ్లలో గురువారం నాలుగు స్వీటు షాపులపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దత్తసాయి స్వీట్‌స్టాల్ యజమాని బాలసుబ్రహ్మణ్యం ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. అలానే లూజ్ పామాయిల్, మైసూర్‌పాక్ నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు. స్టాంప్ లేని 10 కిలోల తూకపు యంత్రాన్ని ఉపయోగిస్తున్నారంటూ లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. వెంకటసాయి స్వీట్ స్టాల్‌ను తనిఖీ చేయగా స్వీట్‌స్టాల్ యజమాని ఎస్.శ్రీను ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. బందరు లడ్డూ నమూనాను విశేషణ నిమిత్తం సేకరించారు. లక్ష్మీ స్వీటు స్టాల్‌ను తనిఖీ చేయగా యజమాని ఈ.నందీశ్వరరావు ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. సిరివైభవ స్వీట్-డైరీని తనిఖీ చేయగా యజమాని డి.శివ ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనుమతులు లేకుండా స్వీట్స్ తయారు చేస్తున్నారంటూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వీటు స్టాల్స్, రెస్టారెంట్ పరిసరాలు, కిచెన్‌లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ తనిఖీలలో ముత్యాల నాయుడు, నాగవెంకటరాజు, భార్గవ మహేష్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఉన్నారు.

10న ఎస్ఏ పదోన్నతులకు అర్హులైన ఎస్జీటీలు హాజరుకావాలి

కాకినాడ రూరల్, మార్చి7: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎస్జీటీలుగా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక విద్య) పదోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 10న సర్వీస్ రిజిస్టర్, అర్హత సర్టిఫికెట్లతో మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని డీఈవో రమేష్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు.

ఆర్జిత సేవగా సత్యదేవుడి రథసేవ

పలు అభివృద్ధి పనులకు పాలకమండలి ఆమోదం

అన్నవరం, మార్చి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు గురువారం పాలకమండలి ఆమోదం తెలిపింది. చైర్మన్ ఐ.వి రోహిత్ అధ్యక్షతన జరిగిన పాలక మండలి సమావేశంలో పలు అంశాలను సభ్యులు ఆమోదించారు. ప్రధానంగా ప్రతి ఆదివారం నిర్వహించే సత్యదేవుడి రథసేవను ఆర్జితసేవగా నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి రూ.2500 టిక్కెట్టు ధరతో నలుగురికి ప్రవేశం కల్పించాలని తీర్మానించారు. రూ.34 లక్షలతో వనదుర్గ ఘాట్‌లో మట్టి పనిచేసేందుకు ప్రతిపాదన చేయగా కమిషనర్‌కు నివేదించాలని నిర్ణయించారు. ఇటీవల పిలిచిన పలు టెండర్లకు లోయెస్ట్ ధరను ఆమోదించారు. దేవస్థానం కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల గంటల వ్యవధి వేతనం నుంచి కన్సాలిడేట్ చెల్లింపుగా మార్చాలని ప్రతిపాదించారు. సత్యదేవుడి బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు ఈనెల 18 నుంచి ప్రారంభించనున్నట్లు ఈవో సభ్యులకు తెలిపారు.

బ్యారేజ్‌పై ఇనుప గడ్డర్లు తొలగింపు

వాచ్‌మన్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు

కొవ్వూరు, మార్చి 7 : విధి నిర్వహణలో ఉన్న వాచ్‌మన్‌ను కొట్టి, చంపుతానని బెదిరించిన 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. బొబ్బర్లంక గ్రామానికి చెందిన బొర్రా సత్యనారాయణ విజ్జేశ్వరం బ్యారేజ్‌పై వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన తండ్రికి సహాయకుడిగా బొర్రా సత్తిబాబు వాచ్‌మన్ డ్యూటీకి వచ్చాడు. అర్ధరాత్రి 12-30 గంటల సమయంలో బొబ్బర్లంక, మద్దూరులంక గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు బ్యారేజ్‌పైకి వచ్చి విజ్జేశ్వరం బ్యారేజ్‌పై భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటుచేసిన ఇనుప గడ్డర్‌ను తొలగించి పక్కనే ఉన్న నీటిలో పడవేశారు. అడ్డువచ్చిన సత్తిబాబును కొట్టి, చంపుతామని బెదిరించారు. దీనిపై సత్తిబాబు కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ వై. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నిడదవోలు, మార్చి 7: నిడదవోలు చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 35 సంవత్సరాల వయస్సు గల యువకుడు మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. యువకుడి ఒంటిపై తెలుపురంగు కట్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉందని చెప్పారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని గుర్తించిన వారు లేదా సమాచారం తెలిసిన వారు 9490617090, 7013360296కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

313 కిలోల గంజాయి స్వాధీనం

దేవరపల్లి, మార్చి 7: గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. సెబ్ డీఎస్పీ కె.జయమౌనిక వివరాలు వెల్లడించారు. కొవ్వూరు నుంచి గోపాలపురం వైపు వెళ్తున్న లారీలో 313 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సెబ్ బ్యూరో రవిప్రకాశ్, సెబ్ ఎస్పీ మహేశ్వరరాజు, సెబ్ డీఎస్ఈవో పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హరియాణాకు చెందిన గూడ్స్ లారీ భువనేశ్వర్ లోడు వేసుకుని వెళ్లి అక్కడ దిగుమతి చేసుకుని తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరంలో 313 కిలోల గంజాయిని క్యాబిన్‌లో వేసుకుని వస్తుండగా లారీని గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను తారీఫ్, ముస్తాఫాను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ కేవీ స్వామి, ఎస్ఐ సుధీర్, డీటీఎఫ్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం


ఐక్యత చాటుతున్న నాయకులు

కొత్తపేట, మార్చి7: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటే నిలిచిన శెట్టిబలిజలకు చట్టసభలలో ప్రాధాన్యం కల్పించాలని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో రాష్ట్ర టీడీపీ శెట్టిబలిజ సాధికార కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శెట్టిబలిజల సాధికారత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకూ ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో శెట్టిబలిజలకు స్థానం లేకపోవడం ఆవేదన కలిగించిందని, అధికార వైసీపీ మూడు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి వెన్నంట ఉండే శెట్టిబలిజలకు రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని కోరారు. అది వీలుకానప్పుడు నామినేటెడ్ పదవులలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం ఇస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వాలన్నారు. రామచంద్రపురం టీడీపీ టిక్కెట్టు సుబ్రహ్మణ్యంకు కేటాయించాలని శెట్టిబలిజ నాయకులు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, కేతా శ్రీను, కాదా వెంకటరమణ, చెల్లబోయిన శ్రీను, మొల్లేటి శ్రీను, మల్లుల పొలయ్య, మేడిశెట్టి సూర్యనారాయణ, పితాని వీరభద్రరావు, గుత్తుల పట్టాభిరామారావు, యల్లమిల్లి జగన్మోహన్, కముజు వెంకటేశ్వరరావు, మట్టపర్తి రాజేశ్వరరావు, మట్టపర్తి అచ్యుత్, వనుము వీరబ్రహ్మం, గుబ్బల మూర్తి, కడలి వెంకటేశ్వరరావు, చొల్లంగి వీరబాబు పాల్గొన్నారు.



సూక్ష్మ శివలింగం


సత్యనారాయణ

మండపేట, మార్చి 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన సూక్ష్మ వస్తువుల తయారీదారుడు అండలూరి వీరవెంకట సత్య నారాయణ శివరాత్రిని పురస్కరించుకుని గురువారం జాతి మరకత పచ్చతో మూడు గంటలు శ్రమించి అతి చిన్న సైజులో సూక్ష్మ శివలింగాన్ని తయారు చేశాడు. ఆయనను పలువురు అభినందించారు.

వైసీపీలోకి ముద్రగడ పద్మనాభం

ఈ నెల 14-17 మధ్యలో ఏదో ఒకరోజు ముహూర్తం


ముద్రగడను కలిసిన మిథున్‌రెడ్డి

కిర్లంపూడి, మార్చి 7: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరడం ఖాయమైపోయింది. ఈనెల 14 నుంచి 17వ తేదీ మధ్యలో తాడేపల్లిలో జగన్ సమక్షంలో ముద్రగడ వైసీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు ఆయనను పార్టీలోకి ఆహ్వానిస్తూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వెళ్లారు. ఆయనతో చాలాసేపు చర్చలు జరిపారు. సీఎం జగన్‌తో సూచనల మేరకు పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చినట్టు వారంతా వివరించారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల అనంతరం వైసీపీలో చేరేందుకు ముద్రగడ అంగీకరించారు. అయితే తేదీ ఏదనేది అధికారికంగా వైసీసీ, ముద్రగడ వర్గం ధ్రువీకరించాల్సి ఉంది. భవిష్యత్తులో రాజ్యసభ, ప్రస్తుతానికి ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ముద్రగడ తనయుడికి కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చేలా గురువారం చర్చలు జరిగినట్టు తెలిసింది. ముద్రగడతో భేటీ అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముద్రగడను సీఎం జగన్ వైసీపీలోకి ఆహ్వానించారని, అందుకే తాము వచ్చినట్టు చెప్పారు. సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన మంచి నిర్ణయం ప్రకటిస్తున్నారని ఆశిస్తున్నామన్నారు. ముద్రగడకు ఏ ఆఫర్ ఇవ్వలేదన్నారు. ముద్రగడ పార్టీలోకి వస్తే జగన్ ఆయనకు సముచిత స్థానం కల్పిస్తారని చెప్పారు. మిథున్‌రెడ్డి వెంట కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, వైసీపీ జగ్గంపేట, పెద్దాపురం ఇన్‌చార్జిలు తోట నరసింహం, దవులూరి దొరబాబు, వైసీపీ నాయకుడు జక్కంపూడి గణేష్ ఉన్నారు.

విద్యుత్ వెలుగుల్లో పాదగయ



పిఠాపురం, మార్చి 7: పాదగయ క్షేత్రం విద్యుత్ కాంతుల వెలుగులతో కాంతు లీనుతోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన, ఉప ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాదగయకు వెళ్లే ప్రధాన రహదారుల్లోనూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

పాదగయ క్షేత్రంలో నేడు

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి స్వామి నిజరూప దర్శనం, ఉదయం 6 గంటలకు కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన, ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు సదస్యము, పండిత సభ సాయంత్రం 6.00 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటల నుంచి స్వామికి లింగోద్భవ కాలాభిషేకం, అర్ధరాత్రి దాటిన తర్వాత నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.



వారసత్వం కోసం కాపుజాతిని తాకట్టు పెట్టొద్దు

కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు


మాట్లాడుతున్న పురంశెట్టి మంగారావు

అమలాపురం టౌన్, మార్చి 7: వారసత్వ, స్వార్థ ప్రయోజనాల కోసం కాపుజాతిని తాకట్టు పెట్టవద్దని కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు హెచ్చరించారు. కాపు నాయకులు చేగొండి హరిరామజోగయ్య, ముద్రగడ పద్మనాభం వారి వారసత్వ రాజకీయ ప్రయోజనాల కోసం స్వార్థ రాజకీయాలకు తెరదీశారని విమర్శించారు. అటువంటి నాయకులను కాపు అనుబంధ కులాలు అనుసరించే ప్రశ్నే లేదన్నారు. డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువారం కాపునాడు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాపు కులస్తులను ఓటు బ్యాంకులుగా చూడవద్దని సూచించారు. కాపులను వెనుకబడినతరగతులుగా గుర్తించి రిజర్వేషన్ కల్పించే సత్తా ఉన్న రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. కాపునాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ మాట్లాడుతూ వెనుకబాటు తనంతో మగ్గుతున్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు ఉపకులాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలన్నారు. 20 అంశాలతో కూడిన డిక్లరేషన్‌ను ఆయన విడుదల చేశారు. కాపునాడు నాయకులు పత్తి దత్తుడు, గంగుమళ్ల శ్రీనివాస్, త్సవటపల్లి నాగు, ఉంగరాల అబ్బులు పాల్గొన్నారు.



ప్రమాదాలపై అప్రమత్తత కోసం మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, మార్చి 7: తమ్మవరంలో ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, పనసపాడులో దేవీ ఫిషరీస్ పరిశ్రమలో అమ్మోనియా వాయువు లీకేజీ అయితే ఎటువంటి రక్షణ, సహాయక చర్యలు తీసుకుంటారో వివరిస్తూ గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ మాక్‌డ్రిల్‌కు సంబంధించిన వివరాలు అందించారు. కేంద్ర, రాష్ట్ర జిల్లా విపత్తుల నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న అమ్మోనియా పరిశ్రమలు సుమారు 30 ఉన్నాయన్నారు. అలాగే మోటారు స్పిరిట్ వినియోగించే పరిశ్రమలు అధికంగా ఉన్నాయన్నారు. మాక్ డ్రిల్ నిర్వహిస్తే భద్రత, రక్షణ ఇతర ప్రమాణాలు మెరుగ్గా ఉంటుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మాక్ డ్రిల్‌లో గమనించిన అంశాల ఆధారంగా విపత్తు నియంత్రణ సంసిద్ధతపై యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఎస్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కట్టా సాంబయ్య, తహశీల్దార్ ఏడీ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి సురేంద్ర ఆనంద్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, పొల్యూషన్ ఈఈ ఎన్.సందీప్, దేవీ ఫిషరీస్, ఎన్‌సీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఫోన్లకు దూరంగా ఉండాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 7 : మహిళలు సాధ్యమైనంత వరకూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని దిశ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వాసవి సూచించారు. రత్నంపేట స్లమ్ ఏరియాలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రజలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. సేవా శిబిరం ముగింపులో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ సత్య సౌందర్య, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 పీవో డీవీ వెంకటరావు, కేఎస్‌వీ సుధారాణి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కేంద్ర బృందం పర్యటన

దేవీపట్నం, మార్చి7: గోకవరం గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో నిర్మిస్తున్న దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీని పోలవరం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివానందన్‌కుమార్ తన బృందంతో గురువారం సందర్శించారు. అధికారులను అడిగి కాలనీ స్థితిగతులను తెలుసుకున్నారు. నిర్వాసితులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఖాళీ చేయించి మూడు సంవత్సరాలు అయ్యిందని అద్దె ఇళ్లల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పవర్ కెనాల్ మరమ్మతులు పూర్తి

మోతుగూడెం, మార్చి 7: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి పవన్ కెనాల్ మరమ్మత్తులు పూర్తి కావడంతో గురువారం ఉదయం నుంచి నీటిని విడుదల చేసి విద్యుత్ ఉత్పత్తిని పునఃప్రారంభించామని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రానికి కెనాల్ మరమ్మత్తు పనులు పూర్తి కావడంతో గురువారం ఉదయం 6గంటల నుంచి డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా కెనాల్‌లోకి నీటిని విడుదల చేపట్టామన్నారు.గురువారం సాయంత్రం 12 అడుగుల వరకు నీటిని విడుదల చేశామని సీఈ తెలిపారు. సీలేరు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో కూడా విద్యుత్ ఉత్పత్తిని చేయడానికి అంతా సిద్ధం చేశామన్నారు.

చింతూరు డీఎఫ్‌వోగా బబిత



చింతూరు, మార్చి 7 :చింతూరు డీఎఫ్ఓగా బబితను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటి వరకు డీఎఫ్‌వోగా విధులు నిర్వర్తించిన సౌజన్యను తదుపరి ఉత్వర్వులు ఇచ్చేంత వరకు వీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

గంజాయి స్వాధీనం

చింతూరు, మార్చి 7 : గంజాయి తరలింపు కేసులో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు ఒడిసాకు చెందిన తాతారావు వద్ద 25 కిలోల గంజాయిని సీలేరు పరిధిలోని వలసగడ్డకు చెందిన మహేష్ కొనుగోలు చేశాడు. మహేష్ చింతూరు మండలం, తూలుగొండకు చెందిన కర్రం రామాంజనేయులుకు 25 కిలోల గంజాయి విక్రయించాడు. అనంతరం ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రామాంజనేయులు సదరు గంజాయిని తెలంగాణలోని భద్రాచలం వరకు తీసుకెళ్లి ఖమ్మంకు చెందిన సుభానికి అందజేయాల్సి ఉంది. కాగా చట్టి కూడలి వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనఖీలలో రామాంజనేయులు పట్టుబడ్డాడు. ఈ మేరకు మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 1 లక్ష 25 వేలు వరకు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

రంపచోడవరం, మార్చి 7: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈవీఎంలను గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పి.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, ఎస్.బొజ్జిరెడ్డి, సిద్ధ వెంకన్నబాబు, ఎం.వాణిశ్రీ, లోత రామారావు, తహశీల్దారు కృష్ణజ్యోతి, డీటీ ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పచ్చదనంపై దృష్టి పెట్టాలి

చింతూరు, మార్చి 7 : పచ్చదనంపై దృష్టి సారించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. ఏపీ కేర్, యునిసెఫ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వైద్యులకు, సూపర్‌వైజర్లకు గ్రీన్ అండ్ క్లైమెట్ రీ సైలెంట్ హెల్త్‌కేర్ ఫెసిలిటీస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పీవో మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చెట్టు నాటాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. శ్రీసాయి భాస్కరరెడ్డి, డా. కోటిరెడ్డి, కాశేశ్వరరావు, నిర్మలకుమారి పాల్గొన్నారు.

పథకాలపై ప్రచారం

దేవీపట్నం,మార్చి 7: చినరమణయ్య పేట పంచాయతీ కమ్మలంపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పథకాలపై నేతలు అవగాహన కల్పించారు

బీసీలంటేనే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాసెస్

● టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు మార్చి 7 : బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని బ్యాక్ బోన్ క్లాస్ అని టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం బిక్కవోలులోని టీడీపీ కార్యాలయంలో బీసీ నేతలతో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో బీసీల కు అగ్రతాంబూలం ఇస్తామని 50సంవత్సరాలకే పెన్షన్ అందజేస్తామని అన్నారు. పెన్షన్‌ను 4వేలకు పెంచుతామని బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేస్తామని అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో 300మందికి పైగా బీసీలు హత్యలకు గురయ్యారని వైసీపీ వేదింపులతో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు రేలంగి నాగేశ్వరరావు, త్రిమూర్తులు, జుత్తుగ కృష్ణ, కర్రి శ్రీనివాసరావు, రాయుడు రామచంద్రరావు, ఏసురత్నం, రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీ జనసేన పార్టీలతోనే సాధ్యం

అనపర్తి: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో పరుగులు పెట్టాలంటే టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఏర్పడనున్న టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వానికే సాధ్యమని టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని మార్కండేయపురం, ఆంజనేయ నగర్, షారోన్‌పురం ఏరియాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్ర మంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, నూతిక బాబూరావు, బాసి, మల్లిడి కృష్ణారెడ్డి, కొవ్వూరి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కక్కుర్తే ప్రజలకు శాపంగా మారింది

● ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 7: రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ కక్కుర్తి వల్ల నగరంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలకు శాపంగా మారిందని టీడీపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 46వ డివిజన్‌లో గురువారం జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, అగురు ధనరాజు, డివిజన్ ప్రెసిడెంట్ మండల రవి, తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకల నిర్మల, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబులతో కలిసి ఇంటింటికివెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నగరంలో రాళ్ల రప్పలు, లైట్లు అంటూ అదే అభివృద్ధి అనుకుంటూ కమిషన్లకు కక్కుర్తిపడుతూ నగరంలో మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థలను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.

'ఎంపీకి బుద్ధి చెప్పడానికే బెల్ట్ తీశారు'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 7: అధికార మదంతో మంచిచెడులు విస్మరించిన రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు బుద్ధి చెప్పడానికే జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ బెల్ట్ చూపించారని ఇందులో తప్పేమిలేదని టీడీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, డివిజన్ ఇన్‌చార్జి బేసరి చిన్ని అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. భరత్ రామ్ తన తండ్రి సమానులైన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావును చెప్పుతో కొడతానని దూషించిన సంఘటనను కవర్ చేయడానికి వైసీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ పడిన తంటాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. తప్పుచేసిన వలంటీర్‌ను నిలదీయడంలో తప్పేముందన్నారు. సమావేశంలో టీడీపీ నగర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను, నాయకులు మేడికొండ అప్పారావు, కానేటి ప్రభుదాస్, ఇంద్రవర్థన్, శేషు, గుంటా రాము, చింతా సత్యనారాయణ, బొడ్డుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

'40 రోజుల్లో జగన్ అండ్‌కోకు రాజకీయ సన్యాసమే'

మరొక 40 రోజుల్లో జగన్ అండ్ కోకు రాజకీయ సన్యాసం తప్పదని జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరిలోని జనసేన సిబ్బంది నివసించే అపార్టుమెంట్‌లో బుధవారంరాత్రి పోలీసులు సోదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

ముద్రగడ ముసుగు తొలగింది : యర్రా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 7 : కాపు ఉద్యమ నేత అని చెప్పుకునే ముద్రగడ పద్మనాభం ముసుగు తొలగిందని టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపు సామాజికవర్గాన్ని ఉద్ధరిస్తానని చెప్పి దశాబ్దాలుగా కాపులను మోసంచేసి నట్టేట ముంచారని మండిపడ్డారు.

మహిళలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఎదగాలి

● డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

దివాన్‌చెరువు, మార్చి7: మహిళలు సున్నితత్వాన్నివదలి శారీరకంగా, మానసికంగా ధృడంగా ఎదగాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డి.ఎల్.ఎస్.ఏ) కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు, డి.ఎల్.ఎస్.ఏ. కార్యదర్శి ప్రత్యూషకుమారి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించ వలసిన అవసరం ఉందన్నారు. ఎన్నోచట్టాలు వచ్చినా గృహహింస, వరకట్నం, అత్యాచారాలు వంటివి సమాజంలో జరుగుతూనే ఉంటున్నాయన్నారు. నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ మహిళల్లో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండి అనే అంశంపై అంతర్జాతీయ మహిళాదినోత్సవం జరుపుకో వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయం మహిళా సెల్ కోఆర్డినేటర్ కె.నూకరత్నం, కన్వీనర్ కె.దీప్తి, ప్రమీలాపద్మరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.విజయకుమారి, స్పానిష్ అధ్యాపకురాలు శివాని, అధ్యాపకులు టి.హైమావతి, బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 7 : ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం ట్రైనింగ్ స్కూల్ ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా కండక్టర్లకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, రాజమహేంద్రవరం డీఎం షేక్ షబ్నం బహుమతులు అందజేశారు. అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లను సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రసూనాంబ ప్రశంసాపత్రాలతో సత్కరించారు. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల మహిళా కండక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. స్త్రీలు అన్ని రంగాల్లో ఉన్నతి సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల మహిళా సాధికార విభాగం, ఉమెన్ జేఏసీ వింగ్ ఈస్ట్‌గోదావరి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలోనే జ్యూట్ బ్యాగ్ స్టార్టప్‌ను నిర్వహిస్తున్న ఫస్ట్ ఎంకాం విద్యార్థిని ప్రవల్లికను అభినందించారు.కళాశాలలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినిలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి, ఉమెన్ జేఏసీ వింగ్ చైర్మన్ ఎంఎస్‌ఎల్ వందన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సోని, కళాశాల మహిళా సాధికార విభాగం కో ఆర్డినేటర్ విజయశాంతి, సభ్యులు, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

గైట్ డిగ్రీ కళాశాలలో..

రాజానగరం, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గైట్ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగంలో ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు తమ స్వీయ సంరక్షణ చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ బి.కెజియారాణి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న విషయాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

స్త్రీ,పురుషులు ఇద్దరూ సమానమే

దివాన్‌చెరువు: సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, మహిళలను గౌరవించడం మన సాంప్రదాయం అని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి. రవికాంత్ అన్నారు. పాలచర్లలోని బీవీసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను కళాశాల జీబీ సభ్యులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకొండ తహసీల్దార్ రాజ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వై.వెంకట్, ఏవో వి.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పూర్తి స్వేచ్ఛ రాలేదు

కడియం, మార్చి 7: స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా నిత్యం మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం వేమగిరి పాఠశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. మహిళా కార్యదర్శి కె.వజన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అరుణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా సమస్యలపై ప్రసంగించారు. కడి యం ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావులు మాట్లాడుతూ మహిళా వికాసం మరింత వర్థిల్లాలని మహిళలంతా ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 12న జాబ్ ఫెస్ట్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 7 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 12న జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ జాబ్ ఫెస్ట్‌లో 25కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 500లకు పైగా ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఎస్‌డీసీ సహకారంతో ఈ జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబ్‌ఫెస్ట్ బ్రోచర్ ఆవిష్కరించారు.

జేఈఈ మెయిన్స్.. బి ప్లాన్ ఫలితాల్లో తిరుమల విద్యార్థికి 100 పర్సంటైల్

రాజమహేంద్రవరంరూరల్, మార్చి 7: కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ బి.ఆర్క్, బి. ప్లానింగ్ ఫలితాల్లో తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బి ప్లానింగ్ విభాగంలో కె.సాకేత్‌ప్రణవ్ 100 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని, బీఆర్క్ విభాగంలో కూడా సాకేత్ 99.89 పర్సంటైల్, కె వెంకట సత్య నీలచలం 99.84 పర్సంటైల్, సిహెచ్ ధనుంజయ 99.84 పర్సంటైల్ సాధించారన్నారు. బీఆర్క్, బీ ప్లాన్ విభాగాల్లో 99 పర్సంటైల్ పైన 35, 98 పర్సంటైల్ పైన 72, 95పర్సంటైల్ పైన 154 మంది సాధించారని తిరుమలరావు తెలిపారు.

లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్ ఆఫర్

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 7 : రాజమహేంద్రవరం లేపాక్షి ఎంపోరియంలో 2023-24 సంవత్సరం క్లియరెన్స్ సేల్స్ సందర్భంగా ఎంపిక చేయబడిన వస్తువులపై 10 నుంచి 40 శాతం వరకు డిస్కౌంటు అందజేస్తున్నామని మేనేజర్ జి.మోనిక తెలిపా రు. ఆఫర్ ఈనెల 31 వరకు ఉంటుందన్నారు. ఎంపోరియంలో అన్ని రకాల హస్తకళ వస్తువులు, నాణ్యత గల చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు.ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

తెలుగుదేశంతోనే బీసీలకు మేలు

కడియం, మార్చి 7: తెలుగుదేశం పార్టీతోనే బీసీ వర్గాలకు మేలు జరుగుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల మంగళగిరిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బీసీలకు ప్రవేశపెట్టిన పథకాలకుగాను గురువారం వేమగిరిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద గ్రామకమిటీ అధ్యక్షుడు గుత్తులకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

స్పానిష్ అధ్యాపకురాలిగా శివాని

దివాన్‌చెరువు, మార్చి7 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్, మేనేజ్మెంట్ స్టడీస్ ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటిలో ఫారిన్ లాంగ్వేజ్ కోర్సు స్పానిష్‌ను బోధించడానికి దివ్యాంగురాలైన శివానిని నియమించి ఉత్తర్వులను వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం అందజేశారు. వీసీ మాట్లాడుతూ ప్రపంచం అంతా కుగ్రామంగా ఉన్న నేటి ఆధునిక కాలంలో ఎక్కువమంది మాట్లాడే భాషపై పట్టుసాధించాల్సి ఉందని అన్నారు.

శాస్త్రోక్తంగా సుదర్శనయోగం పూర్ణాహుతి

కోరుకొండ, మార్చి7:లోక కల్యాణం కోసం ప్రజల సుఖసంతోషాలు శాంతి సహజీవనం కోసం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 3రోజులు పాటు జరిగిన అష్టముఖ గండ బేరుడ శ్రీ లక్ష్మీనరసింహం సుదర్శన యాగం గురువారం పూర్ణాహుతి కార్యక్రమంలో వైభవంగా ముగిసింది. పూర్ణాహుతికి ముందు లక్ష్మీనరసింహస్వామికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు.వైకానస ఆగమ బ్రహ్మ పాళింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో 16 మంది వేద పండితులు ఈ మహా సుదర్శనయాగం నిర్వహించారు.

అంకిత భావంతో వ్యాయామ విద్యాభ్యాసం

రంగంపేట, మార్చి 7 : వ్యాయామ విద్యాభ్యాసంలో అంకిత భావంతో, చిత్తశుద్ధితో పని చేసి ఎందరో విద్యార్థులను మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు తేవడానికి కృషిచేసిన రంగంపేట మండలం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని కండే శైలను గుర్తించి మహాశివరాత్రి సందర్భంగా ఇస్తున్న దర్శిత్రి అవార్డును అందుకోనున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 8 మార్చి 2024 | 5



ఖయకారుడి చేతికి సూరీడు..

మహాశివరాత్రి వేళ ఉదయిస్తున్న సూరీడు శివుడి చేతికి చిక్కాడు.. కావాలంటే ఈ చిత్రం చూడండి.. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు పుష్కరాల రేవు వద్ద ఉన్న శివుడి భారీ విగ్రహం చేతిలో సూరీడు ఇలా ఒదిగాడు.భానుడు ఉదయిస్తుండగా ఆ దృశ్యం శివుడి ఢమరుకం ఉన్న చేతిపై నుంచి చూస్తే అదే చేతితో సూర్య భగవానుడిని పట్టుకున్నట్టు కనిపించిన దృశ్యం గురువారం కెమెరాకు చిక్కింది..శివరాత్రి వేళ ఈ చిత్రం ఆకట్టుకుంది. - పెరవలి

శివయ్య రథానికి వందేళ్లు



పెరవలి, మార్చి 7 : ఏదైనా వస్తువుకి వందేళ్లు పూర్తయ్యాయంటే అది మామూలు విషయం కాదు.. దీనికి వందేళ్లు అని చాలా గొప్పగా చెప్పుకుంటారు. తీపర్రు శ్రీ రాజ రాజ నరేంద్ర స్వామి ఉత్సవ రథా నికి ఈ ఏడాది వందేళ్లు పూర్తయ్యాయి. వందేళ్ల కిందట తీపర్రుకు చెందిన భోగవల్లి వెంకన్న పూర్తిగా టేకుతో ఈ రథాన్ని తయారు చేయించి స్వామికి అం దజేశాడు. అప్పటి నుంచి ప్రతి ఏటా శివరాత్రికి ఈ రథంలోనే స్వామిని ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది.దాత వచ్చి రథంపై చేయి వేసే వరకు లాగుతారు. 35 ఏళ్లు దాత వెంకన్న ఆధ్వర్యంలో ఈ విధంగా నిర్వహించారు.అనంతరం ఆయన కుమా రుడు భోగవల్లి నరసింహమూర్తి 35 ఏళ్లు నిర్వహించారు.దాత మనవడు చంటిబాబు గత 30 ఏళ్లగా రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు..సుమారు పదేళ్ల కిం దట ఈ రథానికి రూ.8 లక్షలతో మరమ్మతులు చేయించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రథం టేకుతో నూతనంగా తయారు చేయాలంటే రూ.40 లక్షల పైనే ఖర్చవుతుందని సమాచారం. శుక్రవారం శివరాత్రి సందర్భంగా రాజ రాజ నరేంద్ర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శివరాత్రికి ముస్తాబు

శివరాత్రి సందర్భంగా గురువారమే శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి.. శుక్రవారం తెల్లవారుజామునే గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివయ్యను దర్శించుకుంటారు. రాత్రి 6 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు శివ జాగరణ చేస్తారు. అనంతరం జాగరణ విరమించి గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తారు. ఈ మేరకు రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి ఘాట్లను సిద్ధం చేశారు.


కడియంలో ముస్తాబైన ఆలయం



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

మహిళలు లక్ష్యం వైపు అడుగేయాలి : పీడీజే

రాజమహేంద్రవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల పురోగతితోనే సమాజం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన వేడుకలకు హాజరై మాట్లాడారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మహిళలు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా లక్ష్యంవైపు అడుగులు వేయాలన్నారు. మహిళలకు విద్యతో పాటు న్యాయ విజ్ఞానం అవసరమన్నారు. వారి సంక్షేమం, రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కృషి చేస్తోందని పీడీజే చెప్పారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు.


మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

మహిళలకు టీడీపీ-జనసేన మేనిఫెస్టో

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 7 : ప్రస్తుత దోపిడీ ప్రభుత్వంలో మహిళాభ్యుదయం కుంటిపడిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మోరంపూడిలోని గన్నిస్ శుభమస్తు కల్యాణ మండపంలో గురువారం తెలుగు మహిళల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆస్తిలో హక్కులు కల్పించి అన్న ఎన్టీఆర్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. చంద్రబాబు మహిళా సాధికారతకు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. చంద్రబాబు పవన్ మహిళాభివృద్ధికి ఒక మేనిఫెస్టోను రూపొందించారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మాట్లాడుతూ టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం పారిశుధ్య మహిళా కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, మచ్చేటి ప్రసాద్, కూరుకూరి కిషోర్, పిల్లా తనూజ, ముత్తాబత్తుల విజయ్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ, మహిళా అధ్యక్షురాలు దండమూడి ప్రమీల, బొండాడ హేమలత, గొందేసి మాధవీలత, పసుమర్తి నాగవర్ధిని, నల్లబోతుల భవాని, బైరెడ్డి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో.. ఎదురుగాలి



ఐప్యాక్ అతి జోక్యంతో మునుగుతున్న వైసీపీ పడవ

- తలారికి కానరాని దారి?
- సలహాదారు రాజీవ్‌కృష్ణ మౌనం
- దూరంగా పలువురు నేతలు
- టీవీఆర్‌తో మరో వైసీపీ నేత భేటీ
- ఇన్‌చార్జికి తప్పని తలనొప్పులు
- త్వరలో టీడీపీలోకి వలసలు?
- ముంచుతున్న అతి జాగ్రత్త

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొవ్వూరు వైసీపీలో గందరగోళం మరింత పెరిగింది. హోంమంత్రి తానేటి వనిత ఉన్నప్పుడు ఓ వర్గాన్ని దూరం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో వనితను గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి.. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు.ఆరంభంలో వనితకు దూరంగా ఉన్న వర్గం తలారికి దగ్గరైంది. కానీ ఐ ప్యాక్ తరపున ఇక్కడ ఒక వ్యక్తి అతిజోక్యం వల్ల మొత్తం కొవ్వూరులో ఇప్పటికే అటూ ఇటూ ఊగుతున్న వైసీపీ పడవ మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా కొవ్వూరు నియోజకవర్గంలో కీలకంగా, కింగ్‌మేకర్లుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు వర్గం ఇంచుమించు పార్టీకి దూరమైపోయింది. ఈ వర్గం తలారి వెంట కూడా పయనించడంలేదు. దీనికి ఐ ప్యాక్ సలహాతో వైసీపీ తీసుకున్న నిర్ణయమే కారణంగా చెబుతున్నారు. పెండ్యాల కృష్ణబాబు కుటుంబానికి చెందిన నేత, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌కృష్ణను ఇక్కడ నుంచి తప్పించి నరసాపురం వెళ్లమని చెప్పడంతో ఆయన ఆగ్రహించినట్టు తెలిసింది.అక్కడకు వెళ్లి తానేం చేస్తాను.. నా సొంత నియోజకవర్గాన్ని వదిలి అక్కడకు ఎందుకు వెళతానని ప్రశ్నించి పార్టీకి దూరంగా ఉంటున్నట్టు సమాచారం. తర్వాత రాజమహేంద్రవరం లోక్‌సభ పరిశీలకుడు, సహాయకుడిగా ఉండమని నచ్చచెప్పే ప్రయత్నం చేయడంతో ఆయన డోంట్‌కేర్ అని చెప్పి హైదరాబాద్ వెళ్లిపోయినట్టు తెలిసింది. దీంతో గతం నుంచి ఆయన వెంట ఉన్న నేతలు వైసీపీ సమన్వయకర్త తలారి వెంకట్రావు వెంట కూడా వెళ్లడం లేదు. వేలాది మంది ప్రజలు వైసీపీ వైఖరిపై మండిపడుతున్నారు. చాగల్లు జడ్పీటీసీ, కొవ్వూరు ఎంపీపీ వంటి వారు దూరమవుతుండడం గమనార్హం. ఈ వర్గంలోని కొందరు నేతలు వైసీపీని వదిలేసి టీడీపీలోకి వెళ్లిపోదామని అడుగుతున్నట్టు తెలిసింది. త్వరలో ఇక్కడ వైసీపీకి పెద్ద షాక్ తగలనుంది. ఇక్కడ సర్వేలు, పరిస్థితులు చూడడానికి బాధ్యత తీసుకున్న ఐప్యాక్‌కు చెందిన వ్యక్తి మితిమీరిన జోక్యంతో కనీసం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లకే కాదు, నియోజకవర్గ ఇన్‌చార్జికి కూడా విలువ లేని పరిస్థితి ఏర్పడినట్టు సమాచారం. తమ ప్రాంతాల్లో సమస్యల గురించి చెప్పి, రోడ్లు, డ్రెయిన్లు వేయాలంటే ఐప్యాక్ వ్యక్తికి చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. వాళ్ల సలహామీదే అందరూ నడచుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఏ ప్రజాప్రతినిధికి ఇక్కడ గౌరవం లేదు. ఐప్యాక్ వ్యక్తి వచ్చి ఫలానా రోడ్డు వేస్తే, ఇక్కడ ఓట్ల ప్రభావం ఉంటుందని చెప్పి, గ్రీన్ సిగ్నల్ ఇస్తే తక్షణం వేసే అవకాశం ఉందని,కానీ నాయకులకు మాత్రం విలువ లేదని వాపోతున్నారు. ఇక్కడ నేతల పరిస్థితి ఇలా ఉంటే.. కొందరు జనసేనకు టికెట్ ఇస్తే తాము వైసీపీని వదిలేస్తామని చెప్పడం గమనార్హం

జనసేన సీటు తెచ్చుకోండి..

వైసీపీని వదిలేస్తాం..?


ఇటీవల మరో పరిణామం సంభవించింది. కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామారావుతో ఫిబ్రవరి 4వ తేదీన హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో కొవ్వూరుకు చెందిన ఓ వైసీపీ నేత భేటీ కావడం గమనార్హం. మీరు జనసేన తరపున సీటు తెచ్చుకోగలిగితే తామంతా మిమ్మల్ని నెగ్గించుకుంటామని చెప్పడం విశేషం. సదరు వ్యక్తి హోంమంత్రి వనితకు సన్నిహితంగా ఉంటూ 'రాజ'కీయంచేసేవారు. తన ఊరిలోని ముఖ్య వర్గాన్ని కాదని పెత్తనం చేసేవారు. అటువంటి వ్యక్తి ఇవాళ వైసీపీకి వ్యతిరేకంగా జనసేన నేతతో మంతనాలు చేయడం ఇటీవల పరిణామం. ఈ ఇద్దరి భేటీ కోసం ఆధారాలు సంపాదించడానికి హోటల్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించడంతో పాటు, ఇంటిలిజెన్స్ అధికారులు తంటాలు పడుతున్నట్టు సోషల్‌మీడియా తెగ ప్రచారం జరుగుతోంది.

మీడియాకు వైసీపీ తాయిలం



కొవ్వూరు, మార్చి 7 : వైసీపీ నాయకుల తీరు మారడం లేదు.. గతంలో ఎన్నడూలేని విధంగా మీడియాను తమ నియంత్రణలో పెట్టుకోవాలని ప్రయత్నాలు చేపట్టారు. మెన్న మంత్రి వేణు, నిన్న ఎంపీ మార్గాని భరత్ రామ్.. నేడు గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు మీడియా ప్రతినిధులకు తాయిలాలు అందజేశారు. కొవ్వూరు వైసీపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌కు పిలిచి గురువారం చీర, జత దుస్తులను అందజేశారు. వైసీపీ సెంట్రల్ కమిటీ నుంచి వచ్చినట్టు వైసీపీ నాయకులు చెబుతున్నారు.

20న అనపర్తికి చంద్రబాబు



అనపర్తి, మార్చి 7 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 20వ తేదీన అనపర్తిలో పర్యటించనున్నారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనపర్తి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం వివరాలను వెల్లడించారు. 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనపర్తిలో ప్రజాగళం పేరుతో నిర్వహించే బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. బహిరంగ సభకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని .వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

గోపాలపురంలో మద్దిపాటికి గ్రీన్‌సిగ్నల్

ఇక అధికార ప్రకటనే తరువాయి



రాజమహేంద్రవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితా కోసం కసరత్తు జరుగుతోంది. బీజేపీతో పొత్తు ఖరారవుతున్నట్టు చెబుతున్నారు.జిల్లాలో అభ్యర్థులను త్వరలోనే ప్రకటించనున్నారు. గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజు పేరు మొదట నుంచి నలుగుతున్న సంగతి తెలిసిందే. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా గోపాలపురం ప్రాంతంలో పర్యటించినపుడు వెంకట్రాజు పేరు ప్రస్తావించారు. దేవరపల్లిలో సభలో పార్టీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడుతో పాటు పలువురు పార్టీ నేతలు వెంకట్రాజును మంచి మెజార్టీతో గెలిపించాలని అప్పట్లో పిలుపునిచ్చారు. అప్పటి నుంచి ఆయన పనిచేసుకుంటున్నా కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. ఆయనను మార్చాలని కొందరు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.దీంతో ప్రజలు కొంత అయోమయానికి గురయ్యారు. చివరకు గురువారం అధిష్ఠానం వెంకట్రాజుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక కొవ్వూరు ఒకటే పెండింగ్‌లో ఉంది. రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలుకు జనసేన నేత కందుల దుర్గేష్ అభ్యర్థిత్వాలను ఖరారు చేశారు.ఇవి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. రెండో జాబితాలో వీరి పేర్లు ప్రకటించనున్నారు.

313 కేజీల గంజాయి స్వాధీనం
8

బస్ రాదు.. రైలు ఆగదు!

- కొవిడ్‌తో రైళ్ల హాల్ట్ కట్
- రోడ్ కం రైలు బ్రిడ్జితో బస్‌లకు బ్రేక్
- గామన్ బ్రిడ్జి వరకే ఎక్స్‌ప్రెస్‌లు
- 100 గ్రామాల ప్రజల ఇక్కట్లు
- యథేచ్ఛగా తిరుగుతున్న భారీ లారీలు
- అయినా పట్టని అధికారులు



రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద రాజమహేంద్రవరం వైపు తీసేసిన గడ్డర్.. బ్రిడ్జిపైకి రాత్రి సమయంలో వెళుతున్న లారీ



కొవ్వూరు, మార్చి 7 : బస్ రాదు.. రైలు ఆగదు.. ఇదీ కొవ్వూరు దుస్థితి..డివిజన్ కేంద్రమైనా కనీసం పాలకులు పట్టించుకోవడంలేదు.రాకపోకల దృష్ట్యా ఈ డివిజన్‌పై సుమారు 100 గ్రామాల ప్రజలు ఆధారపడి ఉంటారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ వెళ్లిన ప్రయాణికులు రైలెక్కితే రాజమహేంద్రవరంలో దిగాల్సిందే.. ఎందుకంటే కరోనా నుంచి కొవ్వూరులో రైళ్ల హాల్ట్ నిలుపుదల చేశారు.పోనీలే బస్ సౌకర్యం ఉంది కదా అనుకుంటే ఇటీవల రోడ్ కం రైలు బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ బస్‌ల రాకపోకలను నిలుపుదల చేసేశారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లిన ప్రజలు తిరిగి డివిజన్ కేంద్రం కొవ్వూరు చేరుకునేందుకు నరకం చూస్తున్నారు.

బస్‌లకు దారి లేదు...

రోడ్డు కం రైలు బ్రిడ్జి మరమ్మతులకు గురైందని భారీ వాహన రాకపోకలను నిషేధిస్తూ కొవ్వూరు, రాజమహేంద్రవరం వైపు ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. దీంతో కొవ్వూరు పరిసర ప్రాంతవాసుల దూర ప్రయాణాలు ప్రయాసగా మారింది. తన పరిపాలన మెచ్చి రెండోసారి హోం మంత్రి పదవి కట్టబెట్టారని గొప్పలు చెప్పుకున్న తానేటి వనిత సైతం సమస్యను పరిష్కరించలేకపోయారు. కొవ్వూరులో కనీసం రైళ్లకు హాల్ట్ ఇప్పించలేకపోయారు. ఎక్స్‌ప్రెస్‌లకు దారి చూపలేకపోయారు. ప్రజల తంటారు ప్రజలు పడతారులే అని వదిలేశారు.దీంతో కొవ్వూరు డివిజన్‌పై ఆధాపడి ప్రయాణించే సుమారు 100 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భారీ లారీలకు దారిచ్చారు..?

కలెక్టర్ ఆదేశాలతో రోడ్ కం రైలు బ్రిడ్జిపై ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేసి భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేయించారు. అయితే ఆ గడ్డర్లు పట్టుమని పదిరోజులు కూడా నిలువలేదు. ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను మాత్రమే పూర్తిగా నిలుపుదల చేయగలిగారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో ఇసుక, గ్రావెల్ తరలించే భారీ లారీలు యథేచ్ఛగా వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజా రవాణాకు అంతరాయం కలిగించి, నిబంధనలను అతిక్రమించి అక్రమ రవాణాకు అనుమతిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రజా రవాణా నిలుపుదల చేసి..రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా చేసే లారీలు యథేచ్ఛగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.ఇంత జరుగుతున్నప్పటికి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదు.

ప్రజలకు ప్రయాణ ప్రయాసే..

పల్లె వెలుగు బస్సులకు అనుమతిచ్చిన అధికారులు, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ఆంక్షలు విధించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాబు వంటి మహా నగరాల నుంచి రాత్రిపూట ఇంటికి వచ్చేవారు కాని, రాత్రి సమయంలో దూర ప్రాంతాలకు వెళ్లవలసినవారు గామన్ వంతెన వద్దకు వెళ్లి బస్సు ఎక్కవలసి వస్తుంది. కొన్ని బస్సులు హైవే పైనుంచి వెళ్లిపోతుండ డంతో అక్కడే దిగి వేచి చూడాల్సిన పరిస్థితి. గామన్ బ్రిడ్జి సెంటర్‌లో ప్రయాణికులు వేచి ఉండడానికి గాని, నిలబడడానికి సరైన వసతులు లేకపోవడం, బ్లేడ్ బ్యాచ్ వంటి అల్లరిమూకలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్ట్ రద్దు చేశారు. కొవిడ్ అనంతరం దేశ వ్యాప్తంగా రైళ్ళ హాల్ట్‌ను పునరుద్ధరించారు. అయితే కొవ్వూరులో ఈనాటికి రైళ్లు ఆగడం లేదు. 10 కి.మీ దూరంలో మూడు హాల్ట్‌లు ఉన్నాయని సాకుగా చూపిస్తున్నారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, మండలాల్లో సుమారు 100 గ్రామాలతో పాటు పోలవరం ఏజన్సీ ప్రాంతవాసులకు అనువుగా ఉంటుంది. రాజమహేంద్రవరం మెయిన్ స్టేషన్ తరువాత గోదావరి స్టేషన్ కంటే కొవ్వూరులోనే రైళ్లు నిలుపుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఇప్పటికి నాలుగుసార్లు పలువురు వినతి పత్రం అందించారు. అయినా ఎటువంటి స్పందన లేదు.

కలెక్టరమ్మా.. ఆలోచించమ్మా..

గామన్ బ్రిడ్జి వద్ద బస్ దిగి ప్రయాణికులు కొవ్వూరు చేరుకోవాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. ఎందుకంటే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు బస్టాండ్‌లోకి రావడంలేదు. దీంతో గామన్ బ్రిడ్జి వద్ద దిగి ఆటో రూ.200 నుంచి రూ.300 లకు మాట్లాడుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇక రైలు ప్రయాణికులదీ మరో ప్రయాస.. విజయవాడలో రైలె క్కితే రాజమహేంద్రవరంలో దిగి మళ్లీ కొవ్వూరు చేరు కోవాల్సిన అగత్యం ఏర్పడింది. దీంతో కొవ్వూరు నుంచి రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎన్నికల సమయం కావడంతో కాస్త ఆలోచించి కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం : కలెక్టర్



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బాధ్యత ఎన్నికల సిబ్బంది, అధికారులతో సమానంగా మీడియాపై ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ కలిసి ఎన్నికల్లో మీడియా పాత్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి పాత్రికేయులు వాస్తవమైన సమాచారంతో కూడిన రిపోర్టింగ్ చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు మాత్రమే ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను సర్వీస్ ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ,అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారికి ,హోం ఓటింగ్‌ను 85 ఏళ్ళు దాటిన, 40 శాతం పైబడిన దివ్యాంగులు, కొవిడ్ బారిన పడిన వారికి ఇస్తామని తెలిపారు. ఎన్నికల సమాచారం కోసం ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ రూపొందించినట్టు తెలిపారు.ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి సిటిజన్ విజల్ యాప్ పని చేస్తుందని చెప్పారు. దీని ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.ఎన్నికల ఫిర్యాదులకు 1950 కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ఎన్నికల్లో నోటిఫికేషన్ ప్రారంభం నుంచి ఎన్నిక ప్రక్రియలో కౌంటింగ్ పూర్తయ్యేవరకు మీడియా అనుసరించాల్సిన అంశాలను పవర్ పాయిట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలోడీపీఆర్వో శ్రీనివాస్,మీడియాప్రతినిధులు పాల్గొన్నారు.

85,311 మందికి వైఎస్ఆర్ చేయూత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 7: జిల్లాలో 85,311 మంది మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా రూ 159కోట్ల96 లక్షలు ఆర్థిక ప్రయోజనాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేయడం జరిగిందని కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు.అనకాపల్లిలో గురువారం సీఎం జగన్ వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో భాగంగా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమచేశారని చెప్పారు. మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యిందన్నారు. డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, కలెక్టర్ మహిళా లబ్ధిదారులకు చెక్ అందించారు.


గోపాలపురం మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై తిరగబడ్డ సర్పంచ్‌లు

మాపై మీ పెత్తనం ఏమిటి

● అధికారులపై తిరగబడ్డ సర్పంచ్‌లు

గోపాలపురం, మార్చి 7: ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచ్‌లపై అధికారుల పెత్తనం ఏమిటంటూ సర్పంచ్‌లు అధికారులపై తిరగబడ్డారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా సమీక్ష జరుగుతున్న సమయంలో కరిచర్లగూడెం, కొవ్వూరుపాడు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు అధికారులపై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి ఇస్తున్న జీతాలు తీసుకుని మాపై పెత్తనం చేస్తారా అంటూ ఎదురుదాడికి దిగారు. దీంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ కలుగజేసుకుని సముదాయించటంతో సర్పంచ్‌లు శాంతించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.రమేష్, వైఎస్ ఎంపీపీ వంగా నారాయణ, తాహసీల్దార్ వనజాక్షి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించి రాతపూర్వకంగా ఇవ్వండి

● ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు, మార్చి 7: గ్రామాల్లో సమస్యలను గుర్తించి రాతపూర్వకంగా ఇవ్వండని ఎంపీటీసీ, సర్పంచ్‌లను ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ అన్నారు. గురువారం కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. కాకర్ల నారాయుడు మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ గ్రా మాల్లో సమస్యలను గుర్తించి మండల పరిషత్ వార్షిక అభివృద్ధి ప్రణాళికలో పొందుపర్చాలన్నారు. మండలంలో అసంపూర్తిగా నిలిచిన హెల్త్ క్లినిక్‌లను మండల పరిషత్ నిధులు రూ.3లక్షలు మంజూరుచేసి పూర్తిచేయాలని నిర్ణయించామన్నారు. అసంపూర్తిగా ఉన్న హెల్త్‌క్లినిక్‌ల వివరాలను పీఆర్ ఏఈకి అందించాలన్నారు. మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్రమునిప్రసాద్ మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశంలో రాజకీయ ప్రసంగాలు చేయడం సరికాదని వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడికి సూచించారు. గ్రా మాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తిచేయడానికి అధికారులు సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.సుశీల, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ నూతంగి రేఖ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

కాపర్‌వైర్ల అపహరణ

గోపాలపురం, మార్చి 7:మండలంలో చిట్యాల గ్రామానికి చెందిన గద్దే యుగంధర్, గద్దే శ్రీనివాస్‌లకు చెందిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారంరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి దానిలో ఉన్న కాపర్‌వైరును అపహరించుకుపోయినట్లు బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడుతూ చిట్యాల పరిసర ప్రాంతాల్లో మోటార్ కేబుల్‌వైర్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అపహరణకు గురవుతున్నాయన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కొంతకాలంగా విద్యుత్ కేబుల్స్‌ను దొంగిలిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఆసుపత్రికి వైద్య సామగ్రి అందజేత

గోపాలపురం, మార్చి 7: గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.3లక్షల విలువ చేసే వివిధ వస్తువులను నవభారత్ లిమిటెడ్ ఫౌండేషన్ జంగారెడ్డిగూడెంనకు చెందిన వ్యవస్థాపక అధ్యక్షుడు ఏఎస్ చౌదరి సౌజన్యంతో సీఎస్ఆర్ గ్రాంట్‌లో భాగంగా ఆసుపత్రికి అవసరమైన వస్తువులను సంస్థ అసిస్టెంట్ మేనేజర్ లీలాకృష్ణ అందజేశారు. సంస్థ తరఫున ఆసుపత్రి రోగులకు ఉప యోగపడే వివిధ రకాల వస్తువులను గురువారం వైద్యులకు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో ఈ వస్తువులను సమకూర్చినట్లు ఆమె తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ముందు ముందు మరిన్ని కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కర రావు, వెలగా శ్రీరామమూర్తి, ఆసుపత్రి కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ చైతన్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమ పథకాలు వేగవంతం చేయాలి

చాగల్లు, మార్చి 7: ఎన్నికల కోడ్ రాకుండానే అభివృద్ధి, సంక్షేమ పథకాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీ టీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఇళ్ల నిర్మాణం చేసుకుని బిల్లులు రాని వారికి బిల్లులు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంవద్ద ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో నూతనంగా నిర్మాణం చేసిన అదనపు తరగతుల భవనంను ఎమ్మెల్యే తలారి వెంకటరావు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బీసీ సదస్సు విజయవంతం చేయాలి

కొవ్వూరు, మార్చి 7 : శనివారం చాగల్లులో జరిగే నియోజకవర్గ బీసీ ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం కొవ్వూరు వైసీపీ కార్యాలయంలో మండలాల వారీగా నాయకులతో సమావేశమయ్యారు. బీసీ ఆత్మీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన చాగల్లులో శ్రీకృష్ణ దేవరాయలు కాపు కళ్యాణ మండపంలో జరిగే బీసీ ఆత్మీయ సదస్సుకు మూడు మండలాలు, కొవ్వూరు పట్టణం నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

నిడదవోలు, మార్చి 7: నిడదవోలు పట్టణ, మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేలమీద కూర్చునేందుకు ఉపయోగపడేలా చాపలు అందజేశారు. విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీలం రామారావు, కుడిపూడి నరేష్, బీఆర్‌కె సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి వర్ధంతి

ఉండ్రాజవరం, మార్చి 7: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 45వ వర్ధంతి సందర్భంగా గురువారం ఉండ్రాజవరంశాఖా గ్రంథాలయంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రరి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు అయ్యంకి గ్రంథాలయ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు జి. రామకృష్ణారావు, పాఠకులు పాల్గొన్నారు.



నిడదవోలులో టీడీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, గణేష్‌చౌక్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా శేషారావు కావాలి

● తెలుగుదేశం పార్టీ శ్రేణులు

నిడదవోలు, మార్చి7: నిడదవోలు నియోజకవర్గానికి టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును అధిష్ఠానం ప్రకటించాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నిడద వోలు పట్టణంలో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు మన శేషారావు మన నిడదవోలు అంటూ సుమారు పదివేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని చాగల్లు రోడ్డులోఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంవద్ద జరిగిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరావు మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా బూరుగుపల్లి శేషారావును బరిలోకి దింపితే నూటికి నూరుశాతం విజయం సాధిస్తారని అన్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటం సాగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పెరవలి మండల అధ్య క్షుడు అతికాల రామకృష్ణమ్మ, రాచమళ్ళ శ్రీనివాసు, వెలగన సూ ర్యారావు, తిరుపతి సత్యనారాయణ, కారింకి నాగేశ్వరరావు, కారింకి సాయిబాబు. పసుమర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొవ్వూరు, మార్చి 7 : చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథ కాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిలు అ న్నారు. అధికారపార్టీ చేస్తున్న ఆరోపణలు టీడీపీ కార్యకర్తలు బల ంగా తిప్పికొట్టాలన్నారు. టీడీపీ ప్రారంభించిన శంఖారావం కార్యక్రమాన్ని బూత్‌స్థాయిలో నిర్వహించి, రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించాలన్నారు.

విద్యార్థులు కృషి,పట్టుదలతో విద్యనభ్యసించాలి

విద్యార్థులు కృషి,పట్టుదలతో విద్యనభ్యసించాలి

దేవరపల్లి, మార్చి 7: విద్యార్థులు కృషి, పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని దేవరపల్లి బీహెచ్ ఎస్ఆర్‌వీ ఎల్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరస్పాండెంట్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లిలో డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే, డిగ్రీ ఫైనలీయర్ ఫేర్‌వెల్‌డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బీడీఎస్ కుమార్, కళాశాల చైర్మన్ మేరీ కమలా, కళాశాల ఏవో ఆనంద్‌ప్రసాద్, అధ్యాపకులు వెంకట్రావు, ఎస్.వెంకటేష్, శ్రీను, రాము, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కొవ్వూరు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 7: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, వీడియో వ్యూవింగ్ టీమ్స్, అకౌంటింగ్ టీమ్స్ సిబ్బందికి ఎన్నికలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ విడుదలచేసిన తరువాత ఎంసీసీ బృందాలు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఎన్నికల ఖర్చులు, రాజకీయపార్టీల అభ్యర్థులు ప్రచారంలో పాటించాల్సిన నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. పోటీలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికలలో చేసే ప్రతి రూపాయిని వారి ఖాతాలలో చూపించాలన్నారు. సమావేశంలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, వీడియో వ్యూవింగ్ టీమ్స్ అకౌంటింగ్ టీమ్స్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి ఈవీఎంలు

కొవ్వూరు, మార్చి 7 : కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయానికి అధికారుల శిక్షణ నిమిత్తం 18 ఈవీఎం మిషన్లు, 18 వివిప్యాడ్లు వచ్చినట్లు తహశీల్దార్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.మస్తాన్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం ఈవీఎమ్ గొడౌన్స్ నుంచి సార్వత్రిక ఎన్నికల సిబ్బందికి ట్రైనింగ్ నిమిత్తం వచ్చి 18 ఈవీఎమ్‌లను కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీసుల సమక్షంలో భద్రపరిచి సీలు వేశారు. ఈవీఎమ్‌లు భద్రపరిచిన రూమ్ వద్ద 24 గంటలు సీసీ కెమెరాల పర్యవేక్షణతోపాటు సాయుధ భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.కమల్‌సుందర్, కార్యాలయ సూపరింటెండెంటు అజయ్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపరుస్తున్న సిబ్బంది

ఓటర్లకు అవగాహన సదస్సు

తాళ్లపూడి, మార్చి 7 : తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రా మంలో సచివాలయంవద్ద గురువారం ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషోర్ మా ట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రతి సచివాలయంవద్ద ఓటుపట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని దీనిలోభాగంగా మలకపల్లిలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఓటరు జాబితాలో తమ ఓటు ఉన్నదో లేదో అని పరిశీలన చేసుకోవాలని, అలాగే మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే వాటిని సంబంధిత బూత్ లెవెల్ అధికారులవద్ద సరి చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

కొవ్వూరు, మార్చి 7 : మహిళలకు ప్రభుత్వాలు అందజేస్తున్న ప్రోత్సాహలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని కొవ్వూరు ఎంపీడీవో కె.సుశీల అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో కొవ్వూరు న్యాయవాదులు ఎం. శ్రీవల్లి, పీవీపీ లక్ష్మి, పి.గుర్నాలు పాల్గొని మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగంలో మహిళల కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసి బొంతా వెంకటలక్ష్మి, మహిళా సర్పంచ్‌లు, ఎంపిటీసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

స్త్రీలు అన్ని రంగాలలో రాణిస్తూ సమాజ అభివృద్ధిలో విశేష కృషిచేస్తున్నారని కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశా లలో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.ఎన్. సూర్యనారాయణ, పుష్పాంజలి, గాయిత్రి రత్నవినోల, సునీత, కాంచనమాల, సాయిసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మహిళ దినోత్సవ వేడుకలు నల్లజర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. నల్లజర్ల సెయింట్ క్లారెట్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ జోసఫ్ శాంతప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు వారి తల్లులను ఆహ్వానించి ప్రత్యేక బహుమతులు అందించారు. అదే విధంగా దూబచర్ల సంఘమిత్ర హైస్కూల్‌లో డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి.వివిధ కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలను సమాజంలో గౌరవించాలన్నారు. మహిళల శక్తి సామర్థ్యాలు పెరిగాయని అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నట్లు పేర్కొన్నారు.


ఉండ్రాజవరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం


కొవ్వూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఉండ్రాజవరం: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్ఈవో డి.శారదాజ్యోత్స్న పేర్కొన్నారు. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం హైస్కూలులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు సమాజంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ఎమ్ఈవో శారదా జోత్స్న, మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఐ. రాంబాబు, కె. వెంకటరత్నం, బి. రామారావు, రామకృష్ణ, షేక్ మీరాసాహెబ్, ఆర్ఎస్ ఫణిప్రధానోపాధ్యాయుడు వి. విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

11న మునిసిపల్ అత్యవసర సమావేశం

కొవ్వూరు, మార్చి 7 : కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ కె.డానియల్ జోసఫ్ తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్న సమావేశంలో పట్టణంలోని 23 వార్డులలో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామన్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

గోపాలపురం, మార్చి 7: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వేలచింతలగూడెంలో గురువారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పెర్నాడ కృష్ణారావు (65) అనే వ్యక్తి బుధవారం గోపాలపురం వెళ్లి అక్కడ అల్పాహారం తీసుకుని వేలచింతలగూడెం నడిస్తూ వెళ్లారు ఎండకారణంగా తీవ్రమైన దాహం వేయడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకింద పడుకున్నాడు. కృష్ణారావు వడ దెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వేసవికాలాన్ని పురస్కరించుకుని ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ నుంచి తమను తాము రక్షించుకునే విధంగా ప్రజలు ఉండాలని సూచిస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి



నిడదవోలు, మార్చి 7: నిడదవోలు చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీ కొని సుమారు 35 సంవత్సరాల వయస్సు గల యువకుడు మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన యువకుడి ఒంటిపై తెలుపురంగు కట్ బనీను, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని గుర్తించిన వారు లేదా సమాచారం తెలిసిన వారు 9490617090, 7013360296కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

'వ్యవసాయ రంగానికి 9 గంటలు విద్యుత్ ఇవ్వాలి'

దేవరపల్లి, మార్చి7: వ్యవసాయ రంగానికి విద్యుత్ 9గంటలు నిరంతరాయంగా ఇవ్వాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లిలో మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురు వారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మా ట్లాడుతూ వ్యవసాయ రంగానికి విద్యుత్ 9గంటలు ఇవ్వాల్సి ఉండ గా కొన్నిచోట్ల నాలుగు గంటలు ఇస్తున్నారని మా దృష్టికి వచ్చిందని దేవరపల్లి ఏఈ కృష్ణారావును అడగ్గా అన్నిచోట్ల 9గంటల విద్యుత్ ఇస్తునానమని మండలంలోని గొల్లగూడెం అచ్చెయ్యపాలెం పీడర్‌లలో ఓవర్‌లోడ్ ఉండటంతో అంతరాయం ఏర్పడుతుందని ఆ రెండు గ్రామాల్లోనూ వ్యవసాయ రంగానికి 9గంటల విద్యుత్ ఇవ్వ డానికి కృషిచేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో దేవరపల్లి, త్యా జంపూడి చిన్నాయిగూడెం, గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్‌లైన్లు ఉండటంతో కాలనీల నిర్మాణానికి అంతరాయం ఏర్పడుతుందని వాటిని షిఫ్టింగ్ వెంటనే చేయాలని అధికారులకి సూచించారు. చిన్నాయిగూడెం ఎంపీటీసీ ఎం.నాగమణి మాట్లాడుతూ చిన్నాయి గూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన చిక్కీలు నాసిరకంగా ఉంటున్నాయని సభాదృష్టికి తీసుకురాగా ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంఈవో తిరుమల దాసును వివరణ కోరగా ప్రభుత్వం అందిస్తున్న చిక్కీలు ఎక్స్‌పేర్ అయిన నాశిరకం అయిన తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో నాడునేడు ద్వారా పూర్తిచేయాల్సిన పనులను వెంటనే చేసేలా చూడాలని ఎంఈవోను ఆదేశించారు. ఎన్ఆర్‌జీఎస్ పనులు, చెరువు పూడికతీత పనులు చేపట్టాలని ఏపీవోకి ఆదేశించారు. దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం, ప్రాథమిక పాఠశాలల్లో మందుల కొరత లేకుండా చూడాలని సక్రమంగా వైద్యసేవలు అందించాలని ఎంపీపీ డాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణం రాజు, తహసీల్దార్ వైవీవీ ఆచార్యులు, జడ్పీటీసీ స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కే.అరుణ, ఎస్.సుబ్బారావు, వివిధ శాఖాధికారులు, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గోష్పాదక్షేత్రంలో

శివరాత్రి ఏర్పాట్లు పూర్తి

● కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ


గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొవ్వూరు గోష్పదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గురువారం క్షేత్రంలో ఏర్పాట్లను ట్రైనీ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అదేవిధంగా ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అగ్నిమాపక శాఖా సిబ్బంది ఫైరింజన్ సహాయంతో స్నానఘట్టాలను శుభ్రం చేశారు. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తులు తొక్కిసలాట లేకుండా బారీకేడ్లు నిర్మించారు. శుక్రవారం లింగోద్భవకాలం నుంచి శివునికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తునట్లు ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు, సుందర గణేష్‌లు తెలిపారు. క్షేత్రంలోని కాశీవిశ్వేరుని వద్ద రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. గోదావరినదిలో స్నానమాచరించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా నదిలో గజఈతగాళ్లను, పడవలను ఏర్పాటుచేశారు. కొవ్వూరు పట్టణ, మండలంలోని శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం

దేవరపల్లి, మార్చి 7: మండలంలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం దేవరపల్లి, పల్లంట్ల, చిన్నాయిగూడెం, గౌరీ పట్నం గ్రామాల్లో పార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి మహోత్సవం సందర్భంగా అన్ని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. దేవరపల్లిలో పార్వతి సమేత ఉమారామలింగేశ్వర స్వామి వారికి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పల్లంట్ల గ్రామంలో రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాలంగిలో వైభవంగా స్వామివారి కల్యాణం

ఉండ్రాజవరం, మార్చి 7: మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పలు గ్రామాల్లో పూర్తి చేశారు. శుక్రవారం శివరాత్రి సందర్భంగా పాలంగి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి బాలత్రిపురసుందరి, రామలింగేశ్వరస్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, దేవస్థాన చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, నాయకులు బొక్కా శివకుమార్ తదితరులు పూజలో పాల్గొన్నారు. కరికాలభక్త సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రబల సంబరం నిర్వహించారు. రాత్రి స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు.

313 కేజీల గంజాయి స్వాధీనం

● ఇద్దరు వ్యక్తుల అరెస్టు


దేవరపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితులు

దేవరపల్లి, మార్చి 7: గంజాయిస్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. సెబ్ డీఎస్పీ కే.జయమౌనిక వివరాలు వెల్లడిస్తూ కొవ్వూరువైపు నుంచి గోపాలపురంవైపు వెళ్తున్న లారీ వాహనాల తనిఖీల్లో భాగంగా 313కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సెబ్ బ్యూరో రవిప్రకాశ్, సెబ్ ఎస్పీ మహేశ్వరరాజు, సెబ్ డీఎస్ఈవో పిట్టా సోమశేఖర్, ఆదేశాల మేరకు మాకు అందిన సమాచారం మేరకు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హర్యానాకు చెందిన గూడ్స్ లారీ భువనేశ్వర్ లోడు వేసుకుని వెళ్లి అక్కడ దిగుమతి చేసుకుని తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరంలో 313కేజీల గంజాయిని క్యాబిన్‌లో వేసుకుని వస్తుండగా లారీని గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తుల ను తారీఫ్, ముస్తాఫాను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20లక్షలు ఉంటుందని అన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరచ నున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్‌సీఐ కేవీ స్వామి, ఎస్ఐ సుధీర్, డీటీఎఫ్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యారేజ్‌పై ఇనుప గడ్డర్లు తొలగింపు

● వాచ్‌మన్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు

కొవ్వూరు, మార్చి 7 : విధి నిర్వహణలో ఉన్న వాచ్‌మేన్ కొట్టి, చంపుతానని బెదిరించిన 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం బొబ్బర్లంక గ్రామానికి చెందిన బొర్రా సత్యనారాయణ విజ్జేశ్వరం బ్యారేజ్‌పై వాచ్ మేన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన తండ్రికి సహాయకుడిగా బొర్రా సత్తిబాబు వాచ్‌మేన్ డ్యూటీకి వచ్చాడు. అర్ధరాత్రి 12-30 గంటల సమయంలో బొబ్బర్లంక, మద్దూరులంక గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు బ్యారేజ్‌పైకి వచ్చి విజ్జేశ్వరం బ్యారేజ్‌పై భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటుచేసిన ఇనుప గడ్డర్‌ను తొలగించి ప్రక్కనే ఉన్న నీటి పడవేశారు. అడ్డువచ్చిన సత్తిబాబును కొట్టి, చంపుతామని బెదిరించారు. దీనిపై సత్తిబాబు కొవ్వూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ వై. శ్రీనివాసరావు కేసు నమోదు చేశామన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	ఆపరేషన్ వాలంటైన్
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	గామి
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	ఆపరేషన్ వాలంటైన్
శ్రీగణపతి	వ్యూహం
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్